**తపస్య మాసము** 22.11.2015

## వ్యర్థ సమయ ముక్త వారము

**1. స్వమానము –** నేను స్వదర్శన చక్రధారిని.

– స్వదర్శన చక్రము వ్యర్థమనే మాయను నాశనం చేస్తుంది. డ్రామా ఇప్పుడు పూర్తయింది, ఇక ఇంటికి వెళ్ళాలని స్వదర్శన చక్రము గుర్తు చేస్తుంది. ఇంటికి వెళ్ళాలన్న ఈ స్మృతి, సమయాన్ని వృథా చేయడం నుండి మనల్ని ముక్తి చేస్తుంది.

**2. యోగాభ్యాసం –**

1. **'ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి' –** మన ప్రియమైన మన్‌మోహినీ దీదీ ఇంటికి వెళ్ళాలి అని అంటూ ఉండేవారు. ఈ విషయాన్నే వారు అందరికీ గుర్తు తెప్పించేవారు.... దాదీజీ కూడా నేను కర్మాతీతంగా అవ్వాలి అని అంటూ ఉండేవారు... మనం కూడా స్వదర్శన చక్రాన్ని త్రిప్పుతూ ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి, కర్మాతీతంగా అవ్వాలి అన్న స్మృతిలో ఉందాము... ఈ స్మృతులు మనల్ని వ్యర్థము నుండి ముక్తి చేస్తాయి...
2. **భగవానువాచ –** 'ఒకవేళ నువ్వు భగవంతుని స్మృతిలో ప్రతి అడుగు వేసినట్లయితే నీ ప్రతి అడుగులో పదమాలు జమ అవుతాయి. విస్మృతితో వేసే అడుగులో పదమాల నష్టం ఉంటుంది'. కావున, మనం మన అమూల్యమైన సమయాన్ని వ్యర్థంగా పోగొట్టుకోకుండా ప్రతి అడుగును బాబా స్మృతిలో వేద్దాము.
3. **భగవానువాచ –** 'ఏ శ్వాసలో బాబా స్మృతి ఉంటుందో ఆ శ్వాసయే సఫలమవుతుంది, మిగతాదంతా నిష్ఫలమే'. కావున, శ్వాస శ్వాసలో బాబాను గుర్తు చేసి మన ప్రతి శ్వాసను సఫలం చేసుకుందాము...

**3. ధారణ - నౌ ఆర్ నెవర్ (ఇప్పుడు లేకున్న మరెప్పుడూ లేదు)**

– బ్రహ్మా బాబా ప్రారంభంనుండి స్వయం మరియు పిల్లల కోసం ఇదే స్లోగన్ చెప్పేవారు – ఇప్పుడు లేకున్న మరెప్పుడూ లేదు. స్వఉన్నతి విషయం కావచ్చు, సేవ కావచ్చు, ప్రతి విషయంలోనూ బాబా ఈ మంత్రాన్ని అమలు చేసారు. అందుకే వారు నంబర్‌వన్‌గా అయ్యారు. మనం కూడా ఈ మంత్రాన్ని ధారణ చేద్దాము. స్వ ఉన్నతి మరియు ఈశ్వరీయ సేవకోసం **'ఇప్పుడే'** అని, వ్యర్థ విషయాలలో **'తర్వాత'** అని అందాము.

**4. చింతన -**

– ఎక్కడెక్కడ మనం వ్యర్థంగా సమయాన్ని పోగొట్టుకుంటున్నాము?

– మనం మన సమయాన్ని వ్యర్థంగా ఎందుకు పోగొట్టుకుంటున్నాము?

– మన ప్రతి క్షణాన్ని ఎలా సఫలం చేసుకోవాలి?

– సంగమయుగీ సమయం గురించి బాబా చెప్పిన మహావాక్యాలు ఏమిటి?

**5. తపస్వీకుల కొరకు –** ప్రియమైన తపస్వీకులారా! సమయము, తుఫాను ఎవరికోసమూ ఎదురుచూడవు అని అంటారు. గడిచిన సమయం చరిత్రగా అవుతుంది. ప్రపంచంలోని ధనాన్ని, శక్తినంతటినీ పెట్టినాకానీ గడిచిన సమయాన్ని తిరిగి తీసుకురాలేము. మిగిలేది కొన్ని సంతోషకర క్షణాలు మరియు పశ్చాత్తాపము. మనం మన సంగమయుగ సమయాన్ని బాబా స్మృతి మరియు సేవలోనే గడుపుదాము. మన జీవిత చివరి క్షణాలలో వెనక్కు తిరిగి చూసుకున్నప్పుడు పశ్చాత్తాపానికి స్థానం ఉండకూడదు. ఉంటే కేవలం ఆనందమే ఆనందము, సంతోషమే సంతోషము...